క్లుప్తంగా

క్రీడా పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్, గ్లో ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: రోటరీ క్లబ్, గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో) కల్చరల్ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో గాజువాక పరిధిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు యార్లగడ్డ వెంకన్న చౌదరి తెలిపారు. ఆటోనగర్‌లోని రోటరీ క్లబ్ విశాఖపట్నం సౌత్ ఆవరణలో పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని, వారి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి బహుమతులను గెలుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉమా మహేశ్వర రెడ్డి, సభ్యులు నితీష్, నిర్మల్ దుగార్, గౌతమ్, కల్చర్ ఫౌండేషన్ అధ్యక్షుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో లయన్స్ క్లబ్ అన్నసమారాధన



బాలికలకు భోజనం వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పంతులు గారి మేడ వద్ద గల స్ఫూర్తి అనాథాశ్రమంలో కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ 'ఫీడ్ ది హంగర్' కార్యక్రమం నిర్వహించింది. దీనిలో భాగంగా 40 మంది బాలికలకు అన్నసమారాధన నిర్వహించారు. శుక్రవారం లయన్స్ క్లబ్ మెంబర్ కుమార్తె చరిష్మా పుట్టిన రోజును పురస్కరించుకొని లయన్స్ ఇంటర్నేషనల్ ఇచ్చిన పిలుపు మేరకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, కె.వి.సుబ్బరాజు, కె.వి.ప్రసాద్, కె.పి.నాయుడు, కె.శంకర్రావు, రవికుమార్, సీహెచ్.వి.సీతారామ రాజు తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడు సంజీవదేవ్‌కు నివాళి



సంజీవదేవ్ చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గాజువాక : ప్రముఖ చిత్రకారుడు, చిత్ర కళా విమర్శకుడు సంజీవదేవ్‌కు వివిధ సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. దేవ్ 24వ వర్ధంతి సందర్భంగా గాజువాకలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా చిత్ర కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు మాట్లాడుతూ దేవ్ గొప్ప తాత్వికుడు, రచయిత, మానవతావాది అని పేర్కొన్నారు. దేవ్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు తుంపాల శ్రీరామ్మూర్తి, జి.కె.విశ్వనాథరాజు, డి.ఎస్.మనోహర్, స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ ప్రిన్సిపాల్ వాణి, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో కొత్త ఓటర్ల నమోదు

గాజువాక : బీజేపీ నాయకులు కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టారు. పాతకర్ణవానిపాలెంలోని పోలింగ్ బూత్ 107 పరిధిలో ఈ కార్యక్రమాన్ని ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపులో భాగంగా ఓటర్ చేతన్ మహాఅభియాన్ ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని రెండు రోజులపాటు నిర్వహిస్తామని, దొంగ ఓట్లను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మీ నమోస్తుతే



ఉక్కు త్రిశక్తి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి సహస్ర కలువ పుష్పార్చన



త్రిశక్తి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అక్కిరెడ్డిపాలెం: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా అంతటా ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరిసింది. వరలక్ష్మీ వ్రతాన్ని నియోజకవర్గ పరిధిలో మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వేకువజాము నుంచే అంతటా సందడి మొదలైంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు ఇళ్లలో పూజ చేసిన అనంతరం అమ్మవారి ఆలయాలకు తరలి వెళ్లారు.

అక్కిరెడ్డిపాలెంలో..

వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పలు నివాసాల్లో మహిళలు లక్ష్మీ ప్రతిమలకు, చిత్రపటాలకు బంగారు ఆభరణాలు, బంగారు కాసులను అలంకరించారు. పూజ అనంతరం వివిధ రకాలైన పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. ముత్తయిదువలకు తాంబూలాలు అందజేసి, ఆశీర్వాదం తీసుకున్నారు.

ఉక్కు త్రిశక్తి ఆలయంలో..

ఉక్కునగరం: శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహా సరస్వతి కొలువుదీరిన త్రిశక్తి ఆలయంలో శ్రావణ మాస పూజలు వైభవంగా జరిగాయి. వేకువజామున మహాదుర్గ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం మహా దుర్గాదేవికి సామూహిక కుంకుమార్చన చేశారు. సాయంత్రం ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో సామూహిక లక్ష్మీపూజ నిర్వహించారు. అమ్మవారిని రజత కవచంతో అలంకరించి, సహస్ర కలువ పుష్పార్చన చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి బర్మా కాలనీలో వేంచేసి యున్న దుర్గాదేవి ఆలయం శుక్రవారం భక్తులతో పోటెత్తింది. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమార్చనలు, దీపారాధనలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ ప్రతిమ



బర్మా కాలనీలోని ఆలయంలో ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

'చలో గాజువాక' విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలి సేవా సంఘం ప్రతినిధులు

అగనంపూడి: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27వ తేదీన జరుపతలపెట్టిన చేనేతల 'చలో గాజువాక' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు కోరారు. అగనంపూడి పద్మ మార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు ఐక్యమత్యంతో, సంఘటితంగా ఉన్నప్పుడే రాజకీయ, సామాజిక మనుగడ సాగించగలమన్నారు. రాజకీయ పార్టీలు తగిన గుర్తింపు నివ్వాలంటే మన సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత చేనేత సంఘం అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్, జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు కొలిపాక అప్పారావు, ప్రతినిధులు వై.శివరామప్రసాద్, పి.నాగేశ్వరరావు, శ్రీ పద్మమార్కండేయ సేవా సంఘం ప్రతినిధులు దొడ్డి దేముడు, బేతా హనుమంతురావు, గంధోళి వెంకటరమణ, గుదే సుశీలా గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఉద్యోగుల సేవలు ఆదర్శం



ఉద్యోగిని సత్కరిస్తున్న క్యూఏటీడీ జీఎం అప్పారావు నాయుడు, నాయకులు

ఉక్కునగరం: విధి నిర్వహణలో సీనియర్ ఉద్యోగులను ఆదర్శంగా తీసుకుని ప్లాంట్ పురోభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని ప్లాంట్ క్యూఏటీడీ విభాగం జనరల్ మేనేజర్ పి.అప్పారావు నాయుడు కోరారు. క్యూఏటీడీ విభాగంలో 40 ఏళ్ల విధులు నిర్వహించి, ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న జనరల్ చార్జిమన్ తిప్పల గురుమూర్తిని శుక్రవారం విభాగం ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ ప్రారంభం నుంచి అనేక ఒడిదొడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకుందంటే సీనియర్ ఉద్యోగుల కృషే కారణమన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు గొందేశి పైడిరెడ్డి, నరేష్‌కుమార్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు .

ఎంపీ ఎంవీవీ దృష్టికి అగనంపూడి టోల్‌గేట్ సమస్య



ఎంపీ ఎంవీవీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: అగనంపూడి టోల్‌గేట్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు విశాఖ ఎంపీ ఎం.వి.వి. సత్యనారాయణను కోరారు. ఎంపీని శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి, వినతిపత్రం అందజేశారు. గడువు తీరినా టోల్‌గేట్‌ను తొలగించకుండా ప్రజలను, వాహనదారులను నిలువు దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. ఆనందపురం-సబ్బవరం-అనకాపల్లి ఆరు లేన్ల రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే అగనంపూడి టోల్‌గేట్ తొలగిస్తామని సుప్రీంకోర్టులో నేషనల్ హైవే హామీ ఇచ్చి, ఉల్లంఘించిందన్నారు. జీవీఎంసీ కౌన్సిల్ గతేడాది టోల్‌గేట్ తొలగించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. టోల్‌గేట్ తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అధునాతన ఔషధాలతో క్యాన్సర్ నివారణ



డాక్టర్ మాధవిని సన్మానిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : క్యాన్సర్ వ్యాధి నివారణకు అధునాతన పద్ధతులు, ఔషధాలు వచ్చాయని అమెరికాలో స్థిరపడ్డ ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థిని, ప్రముఖ మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ గొరుసు మాధవి అన్నారు. శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కామన్ టీచింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 'ప్రివెన్షన్ మెడిసిన్-అంకాలజీ' అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాల వల్ల ప్రపంచంలో క్యాన్సర్ వ్యాధి పెరుగుతోందని అన్నారు. మద్యం, ధూమపానం, వంశపారంపర్యంగా ఈ వ్యాధి సోకుతోందన్నారు. తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు, ఏఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యం, కేజీహెచ్ మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, డాక్టర్ పీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవిని ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

వ్యక్తిని బెదిరించి నగదు అపహరణ

సింహాచలం: వ్యక్తిని బెదిరించి... ఏటీఎంకి తీసుకెళ్లి నగదు అపహరించిన ఘటన జీవీఎంసీ 98వ వార్డు అడవివరం జంక్షన్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన ఉమామహేశ్వరరావు (25) నేవల్ డాక్‌యార్డులో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. ఉమామహేశ్వరరావు గురువారం చీడికాడ వెళ్లి తిరిగి రాత్రి సుమారు 10గంటల సమయంలో వెంకోజీపాలెం వెళ్తూ అడవివరం జంక్షన్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలో మద్యం సేవిస్తున్నాడు. అక్కడికి ముగ్గురు వ్యక్తులు ఆటో, ద్విచక్రవాహనంపై వచ్చారు. నగదు ఇవ్వాలని ఉమామహేశ్వరరావును బెదిరించారు. బలవంతంగా బైకుపై అడవివరంలోని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్దకు తీసుకువెళ్లి ఖాతాల్లో ఉన్న రూ.4 వేలు విత్ డ్రా చేయించి తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. దీంతో ఉమామహేశ్వరరావు కంట్రోల్‌రూమ్‌కి ఫోన్ చేసి విషయం తెలిపాడు. సమాచారం అందుకున్న పెందుర్తి క్రైం ఎస్‌ఐ సల్మాన్ బేగ్ శుక్రవారం ఉదయం అడవివరంలోని మద్యం దుకాణం పరిసరాలతో పాటు అలాగే యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద పరిశీలన జరిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ముగ్గురిని గుర్తించారు. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ఇద్దరిని, ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఒకరిని గుర్తించి అరెస్టు చేశారు.

ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో 28 నుంచి ఉచిత శిక్షణ

గాజువాక : ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో ఈ నెల 28 నుంచి 29 వరకు ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్టు ఆయుష్ ట్రెనింగ్ డివిజన్ వ్యవస్థాపకుడు డాక్టర్ డి.శ్రీనివాస్ తెలిపారు. ఫెవిక్రిల్, ఆయుష్ ట్రెనింగ్ డివిజన్ సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలియజేశారు. గ్లాస్ పెయింటింగ్, పాట్ పెయింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, శిల్పాకార్, క్లే ఆర్ట్, టై అండ్ డై విభాగాలలో ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. నగరంలోని శంకరమఠం రోడ్డులోని ఆయుష్ కేంద్రంలో ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిక్షణ కొనసాగుతుందని, పదేళ్ల వయస్సు దాటిన బాలలు, మహిళలు హాజరు కావచ్చని తెలిపారు. వివరాల కోసం 93909 20291, 97034 67006 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్ఫూర్తి అనాథాశ్రమంలో అన్న సమారాధన



భోజనాలను అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గాజువాక : కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ ప్రతినిధులు గాజువాకలోని స్ఫూర్తి అనాథాశ్రమంలోని చిన్నారులకు శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఫీడ్ ది హంగర్ కార్యక్రమంలో భాగంగా ఆశ్రమంలోని 40 మంది చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించినట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కె.పి.నాయుడు, చరిష్మ, కె.వి.సుబ్బరాజు, కె.వి.ప్రసాద్, కె.శంకరరావు, రవికుమార్, సీహెచ్.వి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి మురుగు



మురుగు నీటిలోంచే రాకపోకలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు గిన్నివానిపాలెం, మహ్మద్ సాహెబ్ పేట రోడ్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఆ మురుగులోంచే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ సమస్యపై ఇప్పటికే జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రహదారి గోతులమయం



అగనంపూడి నుంచి దువ్వాడ వెళ్లే మార్గంలో ..

అగనంపూడి: అగనంపూడి జాతీయ రహదారి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి గోతులమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బొర్రమాంబ ఆలయానికి వెళ్లే మలుపు వద్ద, లక్కరాజుపాలేనికి వెళ్లే మలుపు వద్ద, చింతల గెడ్డ వంతెనపై కోళ్ల ఫారం వద్ద రహదారి అధ్వానంగా ఉంది. లక్కరాజుపాలెంకు వెళ్లే మలుపు వద్ద ష్టైె కంపెనీ ఎదురుగా రహదారి లోతట్టులో ఉండడం వల్ల వర్షపునీరు చేరి రహదారి పూర్తిగా ధ్వంసమైంది. జీవీఎంసీ అధికారులు రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, అగనంపూడి నిర్వాసిత కాలనీవాసులు కోరుతున్నారు.

డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం



డ్రై డేపై అవగాహన కల్పిస్తున్న జెడ్సీసింహాచలం

పెదగంట్యాడ: వారంలో ఒక రోజు.. ప్రతీ శుక్రవారం ప్రతి ఒక్కరూ విధిగా డ్రై డే పాటించాలని జోన్-6 జోనల్ కమిషనర్ సింహాచలం కోరారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి చిన కోరాడ కూడలి వద్ద శుక్రవారం డ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, డ్రమ్ములు, కుండీలపై మూతలు ఉంచాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ వేస్తే దోమలు వృద్ధి చెంది, రోగాలు వ్యాప్తి చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, దొడ్డి శ్రీనివాసరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం మొండి వైఖరి విడనాడాలి



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి ప్రభుత్వరంగ సంస్థల్లో ఒకటైన విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి, ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 925వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎంఎంఎస్ఎం మరియు ఎస్టీఎం విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎందరో వీరుల ప్రాణత్యాగాలు, పోరాటాల ద్వారా నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే ప్రజలు సహించేది లేదన్నారు. పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను, రాయితీలను సమసమాజ స్థాపనకు ఉపయోగపడే విధంగా చేస్తామని ప్రమాణం చేసిన కేంద్ర ప్రభుత్వం.. నేడు పూర్తిగా కార్మికుల హక్కులను కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వ నిర్ణయాన్ని వీడి ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సీనియర్ పౌరులకు అండగా 'హెల్ప్ ఏజ్ ఇండియా'



సమావేశంలో మాట్లాడుతున్న వాసు

గాజువాక : సీనియర్ పౌరులకు హెల్ప్ ఏజ్ ఇండియా అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ 72వ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్ అన్నారు. చినగంట్యాడలో శుక్రవారం నిర్వహించిన సంస్థ ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హెల్ప్ ఏజ్ ఇండియా ఎల్డర్స్ హెల్ప్‌లైన్ ద్వారా సీనియర్ పౌరులకు సహకారం అందుతోందని పేర్కొన్నారు. ఎల్డర్స్ హెల్ప్ లైన్ ప్రతినిధి మణిదీప్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. సీనియర్ పౌరులకు గుర్తింపు కార్డులను అందజేస్తామని, హెల్ప్ లైన్ నంబర్ 14567కు కాల్ చేస్తే అన్ని రకాల సేవలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి థామస్ కురియా కోస్, స్నేహపురి రెసిడెంట్స్ కార్యదర్శి ఏవీఎస్ఎం అప్పారావు, సీనియర్ పౌరులు ఉరుకూటి అప్పారావు, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, కుమార్ సాయి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి పండగ ప్రారంభం



అమ్మవారి సన్నిధిలో జెడ్సీ సింహాచలం తదితరులు

గాజువాక : కొత్తగాజువాక రాజీవ్‌మార్గ్‌లోని సత్తెమ్మతల్లి పండగ మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహోత్సవాల్లో భాగంగా మొదటిరోజు అమ్మవారిని 10,016 గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆదివారం ప్రధాన పండగను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం అమ్మవారిని దర్శించుకుని ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో 76వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దొడ్డి రమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం కోటి, ఆలయ కమిటీ ప్రతినిధులు మళ్ల సత్తిబాబు, పెతకంశెట్టి జోగ అప్పారావు, మద్దాల అప్పారావు, గణేష్, పెద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు రిటైర్డ్ అధికారులకు ఊరట

హైకోర్టు ఉత్తర్వుల మేరకు వైద్య సదుపాయంపై ఆప్షన్

ఉక్కునగరం: 2007 సంవత్సరం తర్వాత రిటైర్ అయిన స్టీల్‌ప్లాంట్ అధికారుల వైద్య సదుపాయంపై యాజమాన్యం ఆప్షన్ కల్పించింది. వారు పీఎంఆర్ఎస్, జీఎంఐపీలలో నచ్చిన దానిని ఎంచుకోవచ్చు. ఉక్కు పదవీ విరమణ అధికారుల వైద్య సదుపాయంపై యాజమాన్యం ఇచ్చిన బలవంతపు ఉత్తర్వులను రిటైర్డ్ అధికారుల సంఘం హైకోర్టులో చాలెంజ్ చేసింది. వాదోపవాదాల అనంతరం పదవీ విరమణ అధికారులకు ఆప్షన్ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఉక్కు యాజమాన్యం ఆప్షన్ సదుపాయం కల్పిస్తూ లింక్‌ను ఉక్కు రిటైర్డ్ అధికారుల పోర్టల్‌లో పొందుపరిచినట్లు ఉక్కు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.వి.డి.ప్రసాద్ తెలిపారు.

కనులపండువగా ఓనం వేడుకలు



ఇండియన్ మారిటైమ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఓనం పర్వదిన వేడుకలు



సంప్రదాయ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు

సబ్బవరం: ఇండియన్ మారీ టైం విశ్వవిద్యాలయంలో వరలక్ష్మీవ్రతం,ఓనం పర్వదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ డైరెక్టర్ వీకే కేశవదేవ్ ఓనం ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించారు. సిరిసంపదలను తీసుకువచ్చే ఎంతో సంతోషమైన రోజు అని తెలిపారు. పండగను పురస్కరించుకొని వర్సిటీలో రంగవల్లులతో అలంకరించి,జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీల్లో భాగంగా విద్యార్థుల సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సంప్రదాయ వంటలతో ఏర్పాటు చేసిన విందు భోజనాలతో కార్యక్రమాన్ని ముగించారు. కార్యక్రమంలో హెచ్ఓడీ ఎస్. జనార్దనన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి చరణ్, జె. రాజు, ప్రొఫెసర్స్ శ్రీ పద్మ, ఎం. ప్రేమ్ చంద్,జి. అవినాష్, ఎ. కుమార్ తదితరులు పాల్గొన్నారు.